క్లుప్తంగా

దాసాంజనేయుడి సన్నిధిలో భక్తుల సందడి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన పూజలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

10 నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10వ తేదీ నుంచి బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా శిక్షణ విభాగం కన్వీనర్ పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల పాటు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 8వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 94900 98021లో సంప్రదించాలని సూచించారు.

సీపీని కలిసిన బీబీఏ ప్రతినిధులు



విజయవాడ స్పోర్ట్స్: ఇటీవల జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ఎన్నికల్లో గెలిచిన కె.బి.సుందర్, సభ్యులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను పోలీస్ కమిషనరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బీబీఏ అధ్యక్షులు కె.బి.సుందర్, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్, కార్యదర్శి జె.శ్రీధర్, సహాయకార్యదర్శి ఎస్.జ్యోతి, లైబ్రేరియన్ ఎ.పాండురంగవిఠల్, కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శి పి.జయలక్ష్మి, క్రీడా, సాంస్కృతిక విభాగం కార్యదర్శి పి.ఆంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి సీపీ రాణాను సన్మానించారు. బీబీఏకు ఎన్నికైన ప్రతినిధులను సీపీ రాణా అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యాన సింగ్‌నగర్ ఫ్లైఓవర్ రోడ్డులో చలివేంద్రం ఏర్పాటుచేశారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్సై దుర్గాదేవి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష,కార్యదర్శులు కె.సరోజ, జి.ఝాన్సీ మాట్లాడుతూ ఐద్వా నాయకులు మోటూరు ఉదయం, దండమూడి భిక్షావతి స్మారకార్థం చలివేంద్రంను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అనంతరం ప్రయాణికులకు పానకం పంపిణీ చేశారు. ఐద్వా నాయకులు దేవికుమారి, సుజాత, అరుణ, విజయలక్ష్మి, పిచ్చమ్మ, లత, చంద్రమణి, మాధవి, సావిత్రి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: స్వరఝరి 35 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని శ్రవణ సదనంలో శనివారం బెంగుళూరుకు చెందిన కొమ్మాజోస్యుల అలేఖ నిర్వహించిన కచేరీ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. మూడు తరాల సంగీత వైభవం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అలేఖ వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్, భక్తరామదాసు, మైసూరు వాసుదేవాచారి, పురందరదాసు, స్వాతి తిరునాళ్ రచించిన కీర్తనలను గానం చేశారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ కొమ్మాజోస్యుల సద్గురు చరణ్, విశాఖపట్నానికి చెందిన కొమ్మాజోస్యుల ఉదయలక్ష్మి వాద్యసహకారం అందించారు. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విశేషం. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ ఆదివారం జరిగే కార్యక్రమంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి రాజ్యలక్ష్మి పురస్కార ప్రదానం చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.

‘ఆసరా’తో ఆర్థిక భరోసా



ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఇతర నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్‌లో శనివారం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు లక్షాధికారులు కావాలనే మంచి ఆలోచనతో వైఎస్సార్ ఆసరా పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. డ్వాక్రా రుణమాఫీ పేరుతో గత చంద్రబాబు సర్కారు మోసగించడంతో రుణభారం ఎక్కువై అక్కచెల్లెమ్మలు దయనీయమైన పరిస్థితుల్లో కూరుకుపోయారన్నారు. మహిళా సంఘాలు చిన్నాభిన్నమై ‘ఏ’ గ్రేడ్‌లోని సంఘాలు ‘సి’, ‘డి’ గ్రేడ్‌లోకి పడిపోయాయని గుర్తుచేశారు. అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలదొక్కుకునేలా ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు.

213 గ్రూపులకు రూ. 2. 02కోట్ల నిధులు జమ

మూడో విడత ఆసరా ద్వారా 30 డివిజన్ లోని 213 గ్రూపుల్లో రూ. 2. 02 కోట్ల నిధులు జమ చేసినట్లు మల్లాది విష్ణు చెప్పారు. అత్యధికంగా సుభానల్లా పొదుపు సంఘానికి రూ. 2.40 లక్షల రుణమాఫీ జరిగినట్లు పేర్కొన్నారు. డివిజన్లో 2,433 మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి పట్టాలు, 682 మందికి చేయూత, 1,685 మందికి అమ్మఒడి అందించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, సీడీఓ జగదీశ్వరి, నాయకులు తుంపాల వరప్రసాద్, గోపిశెట్టి శ్రీను,ఎస్ దుర్గారావు, ఎం దుర్గారావు, మార్తి చంద్రమౌళి, శ్రీనివాసరెడ్డి, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్‌లో..

32వ డివిజన్ అయోధ్యనగర్‌లో శనివారం సాయంత్రం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్ తో కలిసి ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను ఉద్దేశించి ప్రసంగించారు. డివిజన్ కు సంబంధించి మూడవ విడత ఆసరా ద్వారా 83 గ్రూపులలో రూ. 64.84 లక్షల నిధులు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఓ యూసీడీ శకుంతల, సీడీఓ జగదీశ్వరి, నాయకులు సువర్ణ రాజు, ఆదిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, మాల్యాద్రి, వెలగ సురేష్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు వరం



63వ డివిజన్‌లో ఎమ్మెల్యే విష్ణుకు హారతి ఇస్తున్న స్థానికురాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులకు గొప్ప వరమని 63వ డివిజన్‌లోని ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 63వ డివిజన్ 278వ వార్డ్ సచివాలయ పరిధిలో శనివారం జరిగింది. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని తల్లిదండ్రులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును కల్పించాలనే ధ్యేయంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు నిరుపేదలకు గొప్ప కానుకగా ఉన్నాయన్నారు.

ప్రజాధనాన్ని లూటీ చేసిన జన్మభూమి కమిటీలు

గత టీడీపీ ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారని, కనీసం అర్హులకు కూడా సంక్షేమ పథకాలను చంద్రబాబు అందించలేకపోయారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. బీజేపీ నేత సత్యకుమార్ చెప్పేవన్నీ అసత్యాలేనని, రాజధాని నిర్ణయం పూర్తిగా రాష్ట్రానిదేనని కేంద్రం ఎప్పుడో చెప్పినా వాటికి భిన్నంగా మాట్లాడి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేషన్ డీఈ రామకృష్ణ, ఏఈ అరుణ్‌కుమార్, సీడీఓ జగదీశ్వరి, 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి యేసు, సీహెచ్ రవి, మోదుగుల గణేష్, లొడగాని నాగు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ, నాట్యకళా కౌముది చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ శిష్య బృందం చేసిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యప్రదర్శన భక్తితన్మయత్వంలో తేలియాడించాయి. తొలుత శ్రీ శివజ్ఞానపీఠం శ్రీ శివాచార్యస్వామి సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల వెంకటరాంబాబు, కె.సత్యకృష్ణప్రసాద్, కోశాధికారి ఎస్‌వీఆర్, ఉపాధ్యక్షులు వల్లభనేని సతీష్ తదితరులు పర్యవేక్షించారు.

ఆటిజాన్ని ఆరంభ దశలోనే గుర్తించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటిజంను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స ఇస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అయోధ్యనగర్ చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి అన్నారు. స్థానిక వైఎస్సార్ ఆరోగ్యకేంద్రంలో శనివారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ దుర్గాభవాని , ఏఎన్ఎంలే, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ 8వ రోడ్డులో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, ఎముకలు, నరాలు, గుండె, కిడ్నీ, స్త్రీలు, చెవి ముక్కు గొంతు తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ సంఘ కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ది విజయవాడ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యక్రమం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం గవర్నర్‌పేటలోని అమ్మన టవర్స్‌లోని అసోసియేషన్ హాల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా బాల యుగంధర్, ఉపాధ్యక్షులుగా కె.వి. సురేష్ కుమార్, పిడికిటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకట రాజేష్, ఉప కార్యదర్శులుగా చెన్నారెడ్డి, తోట భార్గవ రామకృష్ణ, కోశాధికారిగా కాజ భరత్ కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం 2025 వరకు రెండేళ్లపాటు పదవిలో కొనసాగనుంది.

ప్రణాళికలతో లక్ష్యాలు సాధించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ శ్రీవాస్‌నూపూర్ అజయ్‌కుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో లక్ష్యాలు చేరుకోవాలని, విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నూపూర్ అజయ్‌కుమార్ సూచించారు. కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల దశమ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ వల్లూరు నీరజ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉపసంచాలకులు శ్రీనివాసరావు, దేవదాయశాఖ ఉపసంచాలకులు ఎం.రత్నరాజు మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డంకి కాదని ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వల్లూరు నీరజ కళాశాల ప్రగతిని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలకృష్ణ, ధనలక్ష్మి, సుధారాణి, సుమిత్ర తదితరులు పర్యవేక్షించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



రోడ్లు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన నగరాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ బసవతారక నగర్‌లో శనివారం రూ.17 లక్షల వ్యయ అంచనాతో రోడ్లు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్, పలువురు నేతలు పాల్గొన్నారు.

చైతన్యలో ప్రైమరీ జోనల్ లెవెల్ అబాకస్, నారధాన్ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ప్రైమరీ జోనల్ లెవెల్ అబాకస్, నారధాన్ పోటీలు జరిగాయి. అబాకస్‌లో కేవలం ఆరు నిమిషాల్లో నూరు సమస్యలను సునాయాసంగా సాధించి మేధాశక్తిని కనబరిచారు. స్కూల్ స్థాయి నుంచి జోనల్ స్థాయికి ఎంపికైన 150 మంది విద్యార్థులతో గ్రాండ్ ఫినాలే నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా బంగారు పతకాలు, జ్ఞాపిక, ప్రశంస పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజారాణి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ, నరేంద్ర, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

దేవినగర్‌లో రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు



దేవినగర్‌లో జరిగిన రథోత్సవంలో కాంతారా వేషధారణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయం సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా శనివారం సీతారాముల రథోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో సీతారాములను ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఉత్సవం నిర్వహించారు. విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా రప్పించిన కాంతారా విచిత్ర వేషధారణ నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు మాదినేని కృష్ణారావు, కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు, ఉపాధ్యక్షులుసాంబశివరావు, సీహెచ్ సుబ్బారెడ్డి, కోశాధికారి వెంకట దుర్గానరేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామభక్తి సామ్రాజ్యాన్ని చాటిన సంకీర్తనలు



వాగ్గేయకారుల కీర్తనలు ఆలపిస్తున్న గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్ తదితరులు

విజయవాడ కల్చరల్: శ్రీరామనవమి వేడుల సందర్భంగా గవర్నర్‌పేట చోడవరపు వారి వీధి శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలోని శ్రవణవేదికపై శనివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీలు రామభక్తి సామ్రాజ్యాన్ని చాటాయి. సంగీత విద్వాంసులు వేమూరి విశ్వనాథ్ వాగ్గేయకారులు రామదాసు, అన్నమయ్య, త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. కంచికామకోటిపీఠ ఆస్థాన గాయకులు పోవూరి గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, చారుమతి పల్లవి సంగీత త్రిమూర్తుల కీర్తనలతోపాటు భద్రాచల రామదాసు కీర్తనలకు గాన ప్రతిష్టచేశారు. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, పాలపర్తి ఆంజనేయులు వయోలిన్‌తో సహకరించారు. సంగీత కార్యక్రమాలను వంశపారంపర్య ధర్మకర్త విన్నకోట రామకృష్ణంరాజు ప్రారంభించారు. దేవాలయ అర్చకులు పిరాళ్ళ సాయికుమార శర్మ, చిట్టి నాగకృష్ణశర్మ, ఓరుగంటి సాయికుమార్ శర్మ సీతాసమేత రామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మురుగు పారుదలకు చర్యలు తీసుకోండి



అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్లలో మురుగునీరు అడ్డంకులు లేకుండా సక్రమంగా పారడానికి చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం న్యూ రాజరాజేశ్వరీపేట ప్రాంతంలోని రైల్వే లైను వెంట ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలించారు. వన్‌టౌన్ నుంచి వచ్చే మురుగు నీటి ప్రవాహనికి రైల్వే శాఖ మూడో ట్రాక్ నిర్మాణ పనులకు వినియోగించే పరికరాలు అడ్డుగా వేసిందని, దీంతో వన్ టౌన్, పాత రాజరాజేశ్వరిపేట ముంపునకు గురవుతోందని అధికారులు ఆయనకు వివరించారు. న్యూ రాజరాజశ్వరిపేట రైల్వే గేటు నుంచి సుబ్బరాజునగర్ వరకు పర్యటన సాగింది. అవుట్‌ఫాల్ డ్రైన్ వరకు ఉన్న అడ్డంకులను రైల్వేతో సమన్వయం చేసుకుని యుద్ధప్రాతిపదికన తొలగించాలని, ప్రస్తుతం ఉన్న మట్టి కాల్వ స్థానంలో ఆర్‌సీసీ డ్రైన్లను నిర్మించేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాస్, నారాయణమూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, అశోక్, రైల్వే ఎ.డి.ఇ.ఎన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.


మహనీయుల జీవితాలే ప్రేరణ



యునైటెడ్ ఎన్‌జీఓస్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యాన జాతీయ జెండా ఆవిర్భావ దినోత్సవం

మధురానగర్(విజమవాడసెంట్రల్): మహనీయుల జీవితాలే యువతకు ప్రేరణ అని సామాజిక సేవకుడు, సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. యునైటెడ్ ఎన్‌జీఓస్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యాన శనివారం దుర్గాపురంలో జాతీయ జెండా ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య మదిలో వచ్చిన జాతీయ పతాక రూపకల్పన నేటికీ చరిత్రగా నిలిచిందని చెప్పారు. మరో మహనీయుడు మహాత్మాగాంధీని మెప్పించి జాతీయ పతాకం ఆవిర్భవించి 102 సంవత్సరాలు కావడం మనందరం కృష్ణాజిల్లా వాసులుగా గర్వించదగిన విషయమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య కృష్ణాజిల్లా వాసి కావటం గర్వకారణన్నారు. తొలుత బీఆర్టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు జాతీయ పతాకాలతో దుర్గాపురంలోని పింగళి వెంకయ్య విగ్రహం వరకు ఊరేగింపు జరిగింది. కొత్తవంతెన సెంటర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేసి వారి విగ్రహానికి, పార్క్‌లోని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొప్పన గాంధీ, యు.రాంబాబు, ఎ. గాయత్రమ్మ, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు వసంతకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రాము, బాబూరావు, నరసింహారావు, వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అశ్వవాహనోత్సవం



హనుమత్ వాహనంపై స్వామివారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ రామా కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి దేవస్థానం (కొత్తగుళ్లు)లో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వారి సన్నిధిలో శనివారం రాత్రి అశ్వవాహనోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, చూర్ణుత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోదండరామస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరిగాయి. సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రప్రభువుకు చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అవభృదోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా రంగులు పూసుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత పూర్ణాహుతి చేసి ధ్వజా అవరోహణ కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు చేయగా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గ నరేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చట్టసభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గ నరేష్ పిలుపునిచ్చారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీ జనగణన చేయాలని కోరుతూ ఢిల్లీలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీసీ ల కులగణన చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడెందుకు చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీసీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. పాదయాత్ర ద్వారా బీసీల సమస్యలు తెలుసుకుని, బీసీల మీద చిత్తశుద్ధితో ఆర్. కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇచ్చి చట్టసభల్లో పోరాటానికి సీఎం వైఎస్ జగన్ సహకరించారన్నారు. రాజకీయ పార్టీలు బీసీల ఆగ్రహావేశాలకు గురికావద్దని హెచ్చరించారు. బీసీలకు అండగా నిలిచిన పార్టీలను ఆదరిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ మెండే జ్యోతి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వరప్రకాష్, యువజన విభాగం నగర అదక్షులు కిరణ్, ప్రచార కమిటీ సభ్యులు దినేష్, నగర మహిళ అధ్యక్షురాలు నాగుర్ బి,యస్ తాహిరా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత, పోషకాహార లోపాలు నివారించాలి



గర్భిణీలకు సీమంతాలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీ రావు, ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు, శిశువుల్లో రక్తహీనత, పోష్టికాహార లోపాలను నివారించి, వారిని ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సింగ్‌నగర్ షాదీఖానాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శనివారం అవగాహన కార్యక్రమం, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, మూడేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ పోషణ్ కిట్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. కేజీ రాగిపిండి, కేజీ అటుకులు, జొన్నపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు కర్జూరాలు, పాలు, గుడ్లు పంపిణీ చేస్తున్నారని వివరించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, సీడీపీఓలు టి.నాగమణి, జి.మంగమ్మ, డి.జోత్స్న, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.